

స్టీల్‌ప్లాంటు ఆర్థిక పురోగతికి దోహదం

- మాంగనీస్ మైనింగ్ లీజు పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఉక్కు యాజమాన్యం కృతజ్ఞతలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 17: విజయనగరం జిల్లా గర్భాంలో గల మాంగనీస్ ఖనిజాన్ని తవ్వుకునేందుకు విశాఖ స్టీల్‌ప్లాంటుకు 2032 సంవత్సరం వరకూ అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సీఎండి అతుల్‌భట్ కృతజ్ఞతలు తెలిపారు. ఇది ... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

అందుకోసం కొత్తగా మ్యాప్ తయారీ

- భూములకు సంబంధించి రెవెన్యూ, జీవీఎంసీ రికార్డుల్లో వ్యత్యాసాలు
- రెండింటి మధ్య సమన్వయం అవసరం

'హయగ్రీవ' భూములపై కోర్టులో అఫిడవిట్

- శారదా పీఠానికి ఎకరా రూ.1.5 కోట్లకు కేటాయించాలని కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే...ప్రభుత్వం రూ.లక్షకు ఇచ్చింది
- ఆ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు చేపడితే చర్యలు తీసుకుంటాం
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నంలో ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా పేర్కొన్నారు. అందుకోసం భూముల వర్గీకరణ తెలిసేలా కొత్తసాంకేతిక పరిజ్ఞానంతో ఒక మ్యాపు రూపొందిస్తామని ప్రకటించారు. అంటే ప్రభుత్వ, ప్రైవేటు భూములు, పార్కులు, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, కాలువలు, గెడ్డలు, కొండలు... ఇలా వర్గీకరించి ఒక్కొక్కదానికి ఒక్కొక్క రంగు కేటాయిస్తూ మ్యాప్ తయారుచేస్తే భూములను ఆక్రమణదారుల బారి నుంచి రక్షించుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చిన ఆయన శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు.

హైదరాబాద్‌లో ఒకప్పుడు 500 చెరువులు ఉండగా, ప్రస్తుతం 20 చెరువులు మిగిలాయని పేర్కొంటూ అటువంటి పరిస్థితులు తలెత్తకుండా విశాఖకు ఒక మ్యాప్ అవసరమన్నారు. భూములపై వివాదాలను పరిశీలించినప్పుడు రెవెన్యూ, జీవీఎంసీ రికార్డుల్లో తేడాలు ఉన్నాయని గుర్తించామని పేర్కొంటూ భవిష్యత్తులో ఈ రెండింటి మధ్య సమన్వయం అవసరమన్నారు. జిల్లాలో శనివారం దసపల్లా, హయగ్రీవ భూములు, రామానాయుడు స్టూడియో, కొత్తవలసలో శారదా పీఠానికి ఇచ్చిన భూములు పరిశీలించామన్నారు. విశాఖలో భూములపై చాలాకాలంగా ఫిర్యాదులు వస్తున్నాయని, అదే సమయంలో కోర్టు కేసులు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటనలు చేశామన్నారు. భూసమస్యల పరిష్కారానికి ప్రజలకు ఒక అవకాశం ఇచ్చామని, ... మిగతా 6వ పేజీలో


దసపల్లా భూములను పరిశీలిస్తున్న సిసోడియా

దసపల్లా భూములపై సిసోడియా ఆరా

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివాదాస్పదమైన దసపల్లా భూములను శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా పరిశీలించారు. దసపల్లా భూముల విస్తీర్ణం, ఆ ప్రాంతంలో ఉన్న సర్క్యూట్ హౌస్, జీవీఎంసీ వాటర్ ట్యాంకుల వివరాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, జేసీ కె.మయూర్ అశోక్‌లను అడిగి తెలుసుకున్నారు. దసపల్లా భూములను తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 22-ఎలో పొందుపరిచారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వైసీపీ ముఖ్య నేత ఆదేశాల మేరకు 22-ఎ నుంచి నాటి కలెక్టర్ మల్లికార్జున తొలగించారు. ఆ భూముల్లో నిర్మాణాల కోసం ఎష్యూర్ డెవలపర్స్ సంస్థతో భూముల యజమానులకు ఒప్పందం కుదిరింది. అయితే ఈ భూములకు సంబంధించి టైటిల్ వివాదం ఇంకా పరిష్కారం కానందున యజమానులుగా చెప్పుకుంటున్న వారి పేర్లను టౌన్ సర్వేయర్ రిజిస్టర్‌లో నమోదుచేసేందుకు జీవీఎంసీ నిరాకరించింది. ఈ నేపథ్యంలో దసపల్లా భూములను సిసోడియా పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



గాంధీ విగ్రహం వద్ద జూనియర్ వైద్యుల రిలే దీక్షలు

రోడ్డెక్కిన వైద్యులు

కోల్‌కతా ఘటనపై పెల్లుబికిన నిరసన

జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు

- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జూనియర్ డాక్టర్ల రిలే నిరాహార దీక్షలు
- కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ
- సంఘీభావాన్ని ప్రకటించిన హోంమంత్రి అనిత
- కేజీహెచ్‌తోపాటు బోధనాస్పత్రుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

వైద్యులు రోడ్డెక్కారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా శనివారం నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు జిల్లాలోని ప్రైవేటు హాస్పిటల్స్/క్లినిక్స్‌లో ఇన్‌పేషెంట్, ఓపీ సేవలను నిలిపివేశారు. ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని బోధనాస్పత్రులైన కేజీహెచ్, విమ్స్, ఘోషా, ఇతర ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మరోవైపు జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి సుమారు ... మిగతా 6వ పేజీలో


జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

గంజాయిపై ఉక్కుపాదం

- సాగు, రవాణా నియంత్రణపై దృష్టిపెట్టండి
- ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలకు డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశం
- పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలు
- ఏజెన్సీతో అనుసంధానమైన రహదారుల్లో గల చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా
- తరచూ పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్
- గంజాయి సాగుదారులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి


ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో డీఐజీ గోపీనాథ్

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):
గంజాయి సాగు, రవాణా నియంత్రణపై గట్టిగా దృష్టిసారించాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వంద రోజుల కార్యాచరణపై ఎస్పీలతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. కైలాసగిరిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశమై గంజాయి నియంత్రణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చర్యలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉంటూ పరారీలో ఉన్న వారిని పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. నేరస్తులను పట్టుకునేందుకు నిర్దిష్ట కాలపరిమితిని డీఐజీ నిర్దేశించారు. గంజాయిని ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు వినియోగించే మార్గాలను గుర్తించాలని ఎస్పీలను ఆదేశించారు. ఏజెన్సీతో అనుసంధానమైన మైదాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతోపాటు తగినంత సిబ్బందిని నియమించి, డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేయాలన్నారు. తరచూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న 59 మందిపై పీడీ యాక్ట్‌కు ప్రతిపాదనలు చేశామని, దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉందని డీఐజీ వివరించారు. కంటైనర్లలో గంజాయి రవాణా గుర్తించేందుకు వీలుగా నర్సీపట్నం, అనకాపల్లిలో స్నిపర్‌డాగ్ స్క్వాడ్‌ను అందుబాటులోకి తెచ్చామని అనకాపల్లి ఎస్పీ దీపికా పాటిల్ వివరించారు. 2024లో ఇంతవరకూ విశాఖ పరిధిలోనే 223 గంజాయి కేసులు నమోదుచేసి రూ.4.75 కోట్ల విలువైన 9,517 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఐజీ వివరించారు. ఈ కేసుల్లో 545 మందిని అరెస్టు చేయగా...వారిలో 249 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారన్నారు. నిందితుల నుంచి 155 వాహనాలను స్వాధీనం ... మిగతా 6వ పేజీలో

గనుల శాఖ కొరడా

- శొంఠ్యాంలో అనుమతి లేకుండా గ్రావెల్ తవ్విన వైసీపీ నేతకు నోటీస్
- నరవలో మరొకరికి...


శొంఠ్యాంలో గ్రావెల్ తవ్వకాలు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):
గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా గ్రావెల్ అక్రమంగా తవ్విన వారిపై ఎట్టకేలకు గనుల శాఖ కొరడా ఝులిపించింది. ఆనందపురం, పెందుర్తి మండలాల్లో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్విన ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీచేసింది. గత ప్రభుత్వంలో దాడులకు వెళ్లిన గనుల శాఖ అధికారులను అప్పట్లో ప్రజా ప్రతినిధులు అడ్డుకున్నారు. దాంతో అక్రమార్కుల దందాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ప్రభుత్వం మారడంతో గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు తనిఖీలు చేసి ఎంతెంత తవ్వి తరలించుకుపోయారో నిర్ధారించారు. ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామంలో లెంక రాంబాబు అనే వైసీపీ నేత జగనన్న లేఅవుట్ లెవెలింగ్, రోడ్ల పేరిట సర్వే నంబరు 123లో 36,300 క్యూబిక్ మీటర్లు, సర్వేనంబరు 347లో 27,195 క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను అనుమతి లేకుండా తవ్వినట్టు గుర్తించారు. అందుకు వివరణ ఇవ్వాలని ఆయనకు జిల్లా గనుల శాఖ డీడీఈఎస్ఎన్ఎస్ రాజు తాజాగా షోకాజ్ నోటీస్ జారీచేశారు. ఇంకా పెందుర్తి మండలం నరవలో సర్వే నంబరు 7/4ఎ1లో ఇల్లపు శ్రీనివాసరావు అనుమతి లేకుండా 160 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వి తరలించినట్టు గుర్తించి నోటీస్ ఇచ్చారు. ఇద్దరూ పక్షం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. లేకపోతే గనుల శాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విశాఖ వైసీపీలో బొత్స పాగా

గడిచిన ఎన్నికల్లో ఎంపీగా ఆయన సతీమణి పోటీ

- తాజాగా ఉమ్మడి జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా బొత్స ఎన్నిక
- ఇకపై ఉమ్మడి జిల్లాలో పార్టీపరంగా కీలకపాత్ర

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఇకపై ఉమ్మడి విశాఖ జిల్లాలో చక్రం తిప్పబోతున్నారా?... అంటే ఆ పార్టీ నేతలు అవుననే అంటున్నారు. పార్టీలో కొంతకాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు అందుకు బలాన్ని చేకూర్చుతున్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీలో సమీకరణాలు మారుతున్నాయి. ఇప్పటివరకూ బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ముత్తంశెట్టి శ్రీనివాసరావులు కీలక నేతలుగా ఉన్నారు. కొన్నాళ్ల కిందట జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏజెన్సీ మినహా మిగిలినచోట్ల పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. గాజువాక నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 95 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అన్ని ఓట్ల తేడాతో ఓడిపోవడం రాష్ట్రంలోనే రికార్డుగా నమోదైంది. అలాగే భీమిలి నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు 91 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అదేవిధంగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన బూడి ముత్యాలనాయుడు, మాడుగుల నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేసిన ఆయన కుమార్తె కూడా ఓటమి చవిచూశారు. మిగిలినచోట్ల కూడా కూటమి అభ్యర్థుల చేతిలో వైసీపీ అభ్యర్థులు భారీ తేడాతో ఓడిపోయారు.

ఇదిలావుండగా విజయనగరంలో అంతా తానే అన్నట్టు పార్టీని శాసించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ క్రమంగా ఆ జిల్లాను వదిలిపెట్టి, విశాఖ జిల్లాలో పాగా వేసేందుకు కొద్దికాలంగా ప్రయత్నాలు మొదలెట్టారు. గడిచిన సాధారణ ఎన్నికల్లో బొత్స సతీమణి ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీగా అధిష్ఠానం పోటీకి దింపింది. ఉమ్మడి విశాఖలో పలువురు టికెట్ కోసం యత్నించినప్పటికీ వారందరినీ కాకుండా పొరుగు జిల్లాకు చెందిన ఆమెను అభ్యర్థిగా ప్రకటించింది. విశాఖ జిల్లాలో పార్టీకి పెద్దదిక్కు లేకుండాపోయిందనే భావనతోనే అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి సీనియర్ నేత అయిన బొత్స సతీమణిని నగరానికి తీసుకువచ్చి పోటీ చేయించారని పార్టీ నేతలు భావించారు. కానీ కూటమి అభ్యర్థి ఎం.శ్రీభరత్ చేతిలో ఆమె 5.5 లక్షలకు పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ ... మిగతా 6వ పేజీలో


ఎమ్మెల్సీ ధ్రువీకరణపత్రంతో బొత్స

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

ఎన్నికల కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో శనివారం రాత్రి విశాఖ రేంజ్ పరిధిలో భారీగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి.

- వివరాలు 6వ పేజీలో


ఆంధ్ర మెడికల్ కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

కేజీహెచ్‌లో అర్ధరాత్రి సీపీ పర్యటన

- వైద్యులు, రోగుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- చీకటిగా ఉన్న ప్రాంతాల్లో దీపాలు ఏర్పాటుచేయాల్సిందిగా ఆస్పత్రి అధికారులకు సూచన

మహారాణిపేట, ఆగస్టు 17: కేజీహెచ్‌లో వైద్యుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశించారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో ఆయన శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బ్యాటరీ వాహనంపై అధికారులతో కలసి ఆస్పత్రి ప్రాంగణంలో గల నర్సింగ్ కళాశాల, హాస్టల్, ఏఎంసీ ఉమెన్స్ పీజీ విద్యార్థుల మెస్స్ హాస్టళ్లు, సత్యనారాయణస్వామి ఆలయం నుంచి అనాటమీ, ఫిజియాలజీ విభాగాలకు వెళ్లే మార్గాల్లో పర్యటించారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించారు. మరిన్ని కెమెరాలు ఏర్పాటు, ప్రైవేటు సెక్యూరిటీని పెంచాల్సిన ఆవశ్యకత, తదితర అంశాలను గుర్తించారు. చీకటిగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ లైటింగ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పొదలను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలు జరగకుండా నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భద్రతా చర్యలపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజుతో చర్చించారు. వైద్యులు, రోగుల రక్షణకు పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, పలు వురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

» 52 మందికి పోస్టింగ్స్

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో శని వారం రాత్రి విశాఖ రేంజ్ పరిధిలో భారీగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి.

ఇప్పటికే పలుచోట్ల పనిచేస్తున్న అధికారులు, పోస్టింగ్స్ కోసం ఎదురుచూస్తున్న మొత్తం 52 మందిని బదిలీ చేస్తూ రేంజ్ డీఐడీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేంజ్‌లో ఇంత ఎక్కువ మందిని బదిలీలు చేయడం ఇదే తొలిసారి.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్	బదిలీ అయిన సర్కిల్
టీవీ విజయకుమార్	సోషల్‌మీడియా సెల్ అనకాపల్లి టౌన్	విజయనగరం
చిల్లా నరసింగరావు	విశాఖ రేంజ్	రాంబిల్లి
ఎస్.లక్ష్మణరావు	రాంబిల్లి	విశాఖ రేంజ్
ఎ.విజయకుమార్	నక్కపల్లి యూపీఎస్	టెక్కలి యూపీఎస్
పి.షైడయ్య	టెక్కలి యూపీఎస్	విశాఖ రేంజ్
కె.కుమారస్వామి	అనకాపల్లి సోషల్ మీడియాసెల్	నక్కపల్లి యూపీఎస్
జి.కోటేశ్వరరావు	విశాఖ రేంజ్	కొత్తకోట
ఎల్.అప్పలనాయుడు	కొత్తకోట సర్కిల్	విశాఖ రేంజ్
ఎస్.ధనుంజయరావు	అనకాపల్లి రూరల్	ఎలమంచిలి
ఎస్‌కే గఫూర్	ఎలమంచిలి	విశాఖ రేంజ్
కె.సతీశ్‌కుమార్	రుషికొండ మెరైన్	బొబ్బిలి టౌన్
ఎం.నాగేశ్వరరావు	బొబ్బిలి టౌన్	విశాఖ రేంజ్
ఎల్.హిమగిరి	డీఎస్‌బీ, ఏఎస్ఆర్ జిల్లా	అరకు
సీహెచ్ రుద్రశేఖర్	అరకు	విశాఖ రేంజ్
బి.అప్పలనాయుడు	విశాఖ రేంజ్	డీఎస్‌బీ,ఏఎస్ఆర్‌జిల్లా
జి.అశోక్‌కుమార్	డీటీసీ, ఏఎస్ఆర్ జిల్లా	విజయనగరం రూరల్
ముదిలి శ్రీనివాసరావు	విజయనగరం రూరల్	జీకే వీధి
వి.నారాయణరావు	డీసీఆర్‌బీ, ఏఎస్ఆర్ జిల్లా	పార్వతీపురం టౌన్
హెచ్ మల్లేశ్వరరావు	విశాఖ రేంజ్ డీసీఆర్‌బీ	ఏఎస్ఆర్ జిల్లా
పీవీవీఎస్ఎన్ నరసింహరావు	పార్వతీపురం టౌన్	విశాఖ రేంజ్
పి.అప్పలరాజు	పాయకరావుపేట యూపీఎస్	చోడవరం యూపీఎస్
బమ్మిడి శ్రీనివాసరావు	చోడవరం యూపీఎస్	విశాఖ రేంజ్
జి.ప్రేమ్‌కుమార్	విశాఖ రేంజ్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్
ఎం.చంద్రశేఖర్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్	విశాఖ రేంజ్
ఎ.స్వామినాయుడు	విశాఖ రేంజ్	కశింకోట యూపీఎస్
ఎం.వినోద్‌బాబు	కశింకోట యూపీఎస్	విశాఖ రేంజ్
కె.లక్ష్మణమూర్తి	విశాఖ రేంజ్	అనకాల్లి డీఎస్‌బీ-2
కె.అప్పలనాయుడు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి సీసీఎస్
ఆర్.నీలయ్య	అనకాపల్లి సీసీఎస్	విశాఖ రేంజ్
ఎన్‌వీ ప్రభాకరరావు	విశాఖ రేంజ్	భోగాపురం యూపీఎస్
ఎ.రవికుమార్	భోగాపురం యూపీఎస్	విజయనగరం వీసీఆర్
సీహెచ్ రాజశేఖరరావు	విజయనగరం వీసీఆర్	విశాఖ రేంజ్
కె.అశోక్‌కుమార్	విజయనగరం టాస్క్‌ఫోర్స్ సెల్	రాజాం టౌన్
డి.మోహనరావు	రాజాం టౌన్	కాశీబుగ్గ అర్బన్
ఎన్‌హెచ్‌వీ ఆనంద్	కాశీబుగ్గ అర్బన్	విశాఖ రేంజ్
జి .శంకరరావు	అనకాపల్లి టౌన్	చీపురుపల్లి
ఈ.నరసింహమూర్తి	విజయనగరం డీఎస్‌బీ-2	విజయనగరం మహిళాస్టేషన్
బి.నాగేశ్వరరావు	విజయనగరం మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
ఏవీ లీలారావు	విజయనగరం డీటీసీ	విజయనగరండీఎస్‌బీ-2
బి.లలిత	విజయనగరంలో రిజర్వు	విజయనగరం డీటీసీ
పి.సత్యనారాయణ	ఎల్విన్‌పేట	ఆమదాలవలస
దివాకర వాయునందన యాదవ్	ఆమదాలవలస	వీఆర్
బి.హరి	నర్సీపట్నం	ఎల్విన్‌పేట
ఎం.వెంకటనారాయణ	ట్రాన్స్‌కో నుంచి వచ్చిన అధికారి	అనకాపల్లి ట్రాఫిక్
పి.పైడపునాయుడు	అనకాపల్లి ట్రాఫిక్	వీఆర్
బి.ప్రసాదరావు	విశాఖ రేంజ్	కళింగపట్నం మెరైన్
కె.మురళీధర్	పార్వతీపురంమన్యం వీఆర్	పార్వతీపురంమన్యం డీఎస్‌బీ-2
ఆర్‌వీఎస్ఎస్‌సీహెచ్ శేఖరరావు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి మహిళా స్టేషన్
డి.దీనబంధు	అనకాపల్లి మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
సీహెచ్ వెంకటరావు	శ్రీకాకుళం మహిళా స్టేషన్	జి.మాడుగుల
సి.వాసునాయుడు	సాలూరు టౌన్	ఏఎస్ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్‌టాస్క్‌ఫోర్స్
బి.అప్పలనాయుడు	జీకే. వీధి	సాలూరు టౌన్

పిల్లలకు మత్తు ఔషధాలు విక్రయిస్తే కఠిన చర్యలు

» బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ అప్పారావు, అధికారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 17: పిల్లలకు మత్తు ఔషధాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు సిఫారసు చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ హెచ్చరించారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని జీవీఎంసీ జోన్-4 కార్యాలయ సెమినార్ హాల్‌లో శనివారం బాలలహక్కుల పరిరక్షణ కమిషన్, విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిరోధంలో భాగంగా మందుల దుకాణాల యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ అధ్యక్షత జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దలు తోడు లేకుండా, వైద్యులు సిఫార్సు చీటీలు లేకుండా వచ్చే పిల్లలకు కోరెక్స్ వంటి దగ్గు మందులు, అల్ప్రాజోలం, ఎంజీ బెంజోడియా జెపినిస్, డయాజెపం, నైట్రాజెపం, ఆల్ప్రెక్స్ ట్యాబ్లాయిడ్స్ మత్తు ఇంజక్షన్లు విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. ఐసీడీఎస్ పీడీ జయదేవి, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, ఎం.రజని, వి. అభిప్రియారావు, కూన కల్యాణి, డ్రగ్గిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు, పండ్లు పంపిణీ

సీతంపేట, ఆగస్టు 17: సీతంపేట మధురానగర్‌లోని క్లౌడ్ బ్రిడ్స్ సంస్థ.. శాంతి ఆశ్రమంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పండ్లు పంపిణీ చేసింది. సంస్థ సీఈవో అరుణ్ వెల్లంకి ఆశ్రమంలోని చెవిటి మూగ విద్యార్థులకు సంస్థ సీఎస్ఆర్ నిధులతో సేవ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చిన్నారులకు ఆసరా పలు కార్య క్రవలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

తద్వారా వారు ఇచ్చిన ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో అనధికార లేఅవుట్లు ఎక్కువగా ఉన్నాయని, డెవలపర్లు చదరపు గజాల వంతున విక్రయిస్తున్నారన్నారు. లేఅవుట్‌కు అన్ని అనుమతులు ఉంటేనే క్రయ విక్రయాలకు అనుమతించాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించామన్నారు.

వ్యవసాయ భూములు రెసిడెన్షియల్ ఏరియా అవుతుందని , అయితే కమర్షియల్ కాబోదని పేర్కొంటూ అటువంటిసమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు.

చివరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా సమస్యలతో వచ్చారన్నారు. దసపల్లా భూములకు గతంలో ఎస్టేట్ ఆఫీసర్ గ్రౌండ్ రెంట్ పట్టా ఇచ్చారని, వాస్తవంగా అటువంటి పట్టా ఇవ్వకూడదన్నారు. విశాఖ అర్బన్ ప్రాంతంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, రెవెన్యూ, జీవీఎంసీలు సమన్వయంతో వ్యవహరిస్తే పరిష్కారం దొరుకుతుందన్నారు. హయగ్రీవ భూముల్లో నిర్మాణాలు జరుగుతున్నట్టు తమ పర్యటనలో గుర్తించామని, వాటిపై కోర్టులో కేసు ఉందని చెబుతూ ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. శారదా పీఠానికి భీమిలి మండలం కొత్తవలసలో కారుచౌకగా భూములు ఇచ్చారన్నారు. ఎకరా రూ.1.5 కోట్లకు ఇవ్వాలని కలెక్టర్ ప్రతిపాదించగా కేవలం రూ.లక్షకు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జీవోలో పేర్కొన్న మేరకు అక్కడ పనులు జరగాలని, అందుకు భిన్నంగా కార్యకలాపాలు జరిగితే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

రోడ్డెక్కిన వైద్యులు

... 5వ పేజీ తరువాయి

1,500 మంది జూనియర్ వైద్యులు (యూజీ/పీజీ విద్యార్థులు) ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. నిందితులను తక్షణమే శిక్షించాలంటూ ఈ సందర్భంగా నినాదాలు చేశారు. అనంతరం దీక్షా శిబిరంలో కూర్చుని శాంతియుతంగా నిరసన తెలియజేశారు. జూనియర్ వైద్యుల రిలే దీక్షలకు హోంమంత్రి వంగలపూడి అనిత సంఘీభావాన్ని తెలియజేశారు. జూడాలతో కూర్చుని ప్లకార్డులను ప్రదర్శించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన విభాగాలు, ప్రజా, విద్యార్థి, మహిళా, కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులు సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర మెడికల్ కళాశాల జూడా అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పృథ్వీ, సలహాదారు డాక్టర్ జహంగీర్, ట్రెజరర్ డాక్టర్ ప్రణీత, తదితరులు మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వైద్యులకు రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలను అమలు చేయాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు నగర పరిధిలోని అనేక ప్రైవేటు/కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పనిచేసే సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేజీహెచ్, ఘోషా, ఈఎన్‌టీ, విమ్స్ తదితర ఆస్పత్రుల సిబ్బంది కొన్ని నిమిషాలు బయటకు వచ్చి నినాదాలు చేశారు. గాజువాకలో ప్రైవేటు హాస్పిటల్స్ సిబ్బంది ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు.

కేజీహెచ్‌లో కొనసాగిన వైద్య సేవలు

ఆంధ్ర మెడికల్ కళాశాలలోని బోధనాస్పత్రుల్లో మాత్రం రోగులకు ఇబ్బందులు లేకుండా యథావిధిగా ఓపీ సేవలను కొనసాగించారు. కేజీహెచ్‌లో సుమారు 1,400 మందికి ఓపీ సేవలు అందించారు. ఆరు సర్జరీలు నిర్వహించగా, క్యాజువాల్టీలో అత్యవసర పరిస్థితుల్లో చేరిన ముగ్గురికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అయితే, ఆటోల్లో, అంబులెన్స్‌లలో వచ్చిన రోగులను వార్డులు, ఓపీలకు తీసుకువెళ్లాల్సిన వార్డుబాయ్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రోగులను వారి కుటుంబ సభ్యులే దగ్గరుండి తీసుకువెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలావుంటే విమ్స్‌లో 150 మందికి ఓపీ సేవలు అందించారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నామన్నారు. గంజాయి సాగవుతున్న ప్రాంతాలు ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్టు శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించామన్నారు. గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలకు ఎస్పీలు, ఇతర అధికారులు వెళ్లి ప్రత్యామ్నాయ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఐజీ ఆదేశించారు. దీని కోసం ప్రభుత్వ శాఖల అంతర్గత కమిటీ ఏర్పాటుచేసి తరచూ గ్రామాల్లో అవగాహన సమావేశాలు, కళాజాతలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నిషేధం, వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలపై గిరిజనులకు అర్థమయ్యేలా ముఖ్యమైన జంక్షన్లు, ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్, విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏడీపీఎస్ స్పెషల్ ప్రాసిక్యూటర్ వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వైసీపీలో బొత్స పాగా

... 5వ పేజీ తరువాయి

బొత్స తరచూ విశాఖలోనే విలేకరుల సమావేశాలు నిర్వహించి పార్టీ గళం వినిపించడంతోపాటు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి స్థానికంగా పలువురు నేతలు పోటీ పడ్డారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడుతోపాటు మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పోటీకి ఆసక్తి చూపినట్టు ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా వారెవరినీ కాకుండా పొరుగు జిల్లాకు చెందిన బొత్సను అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానిక సంస్థల్లో వైసీపీకి మెజారిటీ ఉండడంతో కూటమి పోటీకి దూరంగా ఉంటున్నట్టు ప్రకటించింది. దీంతో ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కీలకమైన విశాఖలో పార్టీకి పెద్దదిక్కు లేదనే అభిప్రాయంతో ఉన్న అధిష్ఠానం...ఇకపై బొత్స ఆ లోటు తీరుస్తారనే ఆశలు పెట్టుకుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో పార్టీకి బొత్స కేంద్రబిందువు కానున్నారనడంలో అనుమానం లేదని సీనియర్ నేతలు సైతం అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటు ఆర్థిక పురోగతికి దోహదం

... 5వ పేజీ తరువాయి

ఒక మైలురాయి అని పేర్కొన్నారు. లీజు పొడిగింపునకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ విశేష కృషిచేశారని పేర్కొన్నారు. మైన్స్ లీజు ప్రాంతం 654 ఎకరాలని, వార్షిక వినియోగం ఏడాదికి ఆరు వేల టన్నులని పేర్కొన్నారు. హాట్‌మెటల్ ఉత్పత్తి చేయడానికి బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో మాంగనీసు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ లీజు పొడిగింపు సంస్థ ఆర్థిక పురోగతికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

దేశంలో తీవ్రస్థాయిలో నిరుద్యోగ సమస్య



మాట్లాడుతున్న సతీష్

డాబాగార్డెన్స్, ఆగస్టు 17: దేశంలో నిరుద్యోగ సమస్య అత్యంత తీవ్ర స్థాయిలో ఉందని సౌత్ సెంట్రల్ జోనల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం యూనియన్ విశాఖ డివిజన్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమాల్లో భాగంగా 'భారతదేశం-నిరుద్యోగ సమస్యకు కారణాలు... పరిష్కారం' అనే అంశంపై విశాఖ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 46ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 9.2 శాతం నిరుద్యోగ్య సమస్య నమోదైనట్టు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 56 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయడంలేదన్నారు. విశ్రాంత లెక్చరర్ కె. పద్మ , ఎస్ఎఫ్ఐ నాయకులు నాయుడు, డీవైఎఫ్ నాయకులు సంతోష్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, కార్యదర్శి జి.వరప్రసాద్, మీడియా ఇన్‌చార్జ్ ఏ.రామకృష్ణ పాల్గొన్నారు.

చీటీలు, ముందస్తు డిపాజిట్ల సేకరణపై కేసులు నమోదు: సీపీ

మహరాణిపేట, ఆగస్టు 17: అనధికారికంగా డిపాజిట్లను సేకరిస్తున్న వారిపై రెండు కేసులు నమోదు చేసి సంబంధిత వ్యక్తులను అరెస్టు చేసినట్టు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చీ తెలిపారు. శనివారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రకాల ఆర్థిక నేరాలు, చీటీల వ్యాపారం, గొలుసు కట్టు వ్యాపారం, మల్టీలెవల్ మార్కెటింగ్ ద్వారా వ్యక్తుల నుం చి ముం దస్తు డిపాజిట్లు సేకరించి టెర్మ్ పూర్తయిన తరువాత తిరిగి సమ్ము చెల్లించని వ్యక్తులపై, కొన్ని రకాల రియల్ ఎస్టేట్ వ్యాపారంతో మోసం చేస్తున్న వారు, ట్రస్టులపేరుతో మోసాలు చేసేవారు ఏపీ ప్రొ టెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నేరస్తులని పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మహరాణిపేట, ఆగస్టు 17: కోల్‌కత్తా ఘటన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వైద్య సేవలునిలిచినా, కేజీహెచ్‌లో రోగులకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటుద్వారా సేవలందిస్తున్నట్టు సూపరింటెండెంట్ శివానంద తెలిపారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశ వ్యాప్తంగా 24 గంటలపాటు అత్యవసర వైద్యం మినహా మిగిలిన సేవలు నిలిపివేయాలని పిలుపు నిచ్చింది. ఈ బంద్‌లో జూనియర్ డాక్టర్లతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ సీనియర్ వైద్యులు బంద్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో శనివారం బంద్ విషయం తెలియని అనేక మంది రోగులు కేజీహెచ్‌కు తరలివచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. శనివారం కేజీహెచ్‌లో 1451 మంది కొత్తగా ఓపీ రోగులకు, 384 మంది పాత రోగులు, 85 మంది ఐపీ రోగులకు, 52 క్యాజువాలిటీలో ఎమర్జన్సీ రోగులు చికిత్స పొందారని వివరించారు. అలాగే, మూడు సర్జరీలు, రెండు అత్యవసర శ స్త్ర చికిత్సలు నిర్వహించినట్టు చెప్పారు. పారా క్లినికల్ ఫ్యాకల్టీ సీనియర్ రెసిడెంట్లు, సర్వీస్ పోస్టుగ్రాడ్యూట్ వైద్యులను నియమించి రోగులకు చికిత్స అందించి ఎటువంటి ఆటంకం కలుగకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు.

సోమవారం నుంచి కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

మహరాణిపేట, ఆగస్టు 17: కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 19 వ తేదీ సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అ న్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరి స్తారన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సినీ కళామతల్లి ముద్దుబిడ్డ మెగాస్టార్ చిరంజీవి



ప్రసంగిస్తున్న సినీనిర్మాత కంచర్ల అచ్యుతరావు

డాబాగార్డెన్స్, ఆగస్టు 17: సినీ కళామతల్లి ముద్దుబిడ్డ మెగాస్టార్ చిరంజీవి అని సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డా.చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. చిరంజీవి సేవాతత్పరులు అన్నారు. చిరంజీవి జీవిత కథ చిత్రం తీస్తానని తెలిపారు. సినీ రంగంలోని రాణించాలనుకునేవారంతా తప్పకుండా చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు జి.జగదీష్, కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'ఆక్రమిత ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలి'



ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వినతి పత్రమిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం, ఆగస్టు 17: విశాఖ జిల్లాలో ఆక్రమణదారుల చెరలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిఆర్.పి. సిసోదియాను సీపీఐ నాయకులు కోరారు. సోమవారం కార్యదర్శికి ఈ మేరకు వినతి పత్రమిచ్చారు. విశాఖ రూరల్ మండలం పరదేశపాలెంలో వైసీపీ నాయకుడు ధర్మాన ప్రసాదరావు. కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు కబ్జాచేసిన సర్వే నెం187/1లో 4.89 ఎకరాలు భూమి ,కొమ్మాదిలో కె.శ్రీనివాసరెడ్డి సర్వే నం: 28/2లో 10.18 ఎకరాలు, సర్వే నం: 154/3లో 5 ఎకరాలు, సర్వే నం: 7 పార్టులో 10 ఎకరాలు, 161/1లో 10 ఎకరాలు, పరదేశిపాలెం పంచాయతీలో 166/1లో 23 ఎకరాలు, 132లో 50 ఎకరాలు, నరవ గ్రామం సర్వే నం: 7లో 42.25 ఎకరాలు, మధురవాడ సర్వే 331/5లో 10 ఎకరాలు, 367లో 10 ఎకరాలు, పెదగంట్యాడలో 274లో తిప్పలనాగిరెడ్డి కుటుంబసభ్యులు సొంతం చేసుకున్న 60 ఎకరాలు, దసపల్లా భూములు, 22ఏలో అన్యాక్రాంతం చేసి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఎస్సీల వర్గీకరణతో రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

» మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు



సంఘీభావం తెలుపుతున్న మాలమహానాడు ప్రతినిధులు

సీతంపేట, ఆగస్టు 17: ఎస్సీల వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చే విధంగా ఉందని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత మేధావులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అన్యాయంగా ఉందన్నారు. కుల సంఘాల సభకు ప్రధాని హాజరయ్యారన్నారు. మంద కృ ష్ణ మాదిగ ఢిల్లీలో కొందరిని కలిసి ఈ విధంగా తీర్పు వచ్చేలా ప్రయత్నాలు చేసినట్టు ఆయన ఆరోపించారు. ఉషా కమిషన్ నివేదిక ప్రకారం మాదిగలకు ఎక్కడా అన్యాయం జరగలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఉప కులాలమధ్య చిచ్చు పెట్టేలా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ఫౌండర్ కన్వీనర్ డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ మాలలపై విషం కక్కుతున్న వారిని తరిమికొడుతామన్నారు. సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ తీర్పు ద్వారా వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు, దళిత ప్రజా వేదిక ప్రతినిధి ఆలీ, హేమసుందర్, డాక్టర్ బూసి వెంకటరావు, ఎం.అప్పలరాజు, పి.సుధాకర్, బొంత శ్యామ్ రవిప్రకాశ్, సాంబయ్య, తిరుపతిరావు, ప్రొఫెసర్ అశోక్ అంబేడ్కర్, చక్రవర్తి, బొచ్చ రామసూర్య, ఎంవి రాహుల్, తదితరలు పాల్గొన్నారు.

ఇకపై ఆన్‌లైన్‌లోనే ఎఫ్ఐఆర్ కాపీ: సీపీ

మహారాణిపేట, ఆగస్టు 17: పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసిన బాధితులు ఎఫ్ఐఆర్‌ను ఇకపై ఆన్‌లైన్‌లో సులువుగా పొందవచ్చని నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రాత బాగ్చీ తెలిపారు. శనివారం పోలీసు కమిషనరేటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులు తమ ఫిర్యాదు ఇచ్చిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదవుతుందని, అ నంతరం సంబంధిత ఎఫ్ఐఆర్ కాపీని గతంలోలా స్టేషన్‌కులోకాకుండా ఏపీ పోలీసు వారి వెబ్‌సైట్ నుంచి ఇచ్చిన లింక్‌ను వినియోగించి డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

వైద్యుల నిరసన



ఘోషాసుపత్రి ఆవరణలో నర్సింగ్ ఉద్యోగుల నిరసన

పూర్ణామార్కెట్, ఆగస్టు 17: కోల్‌కత్తాలోని అజీర్‌కార్ ఆసుపత్రిలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రి నర్సింగ్ స్టాఫ్, వైద్యవర్గాలు శనివారం నిరసన తెలిపాయి. శనివారం ఆసుపత్రి ఆవరణలో మహిళలకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఇటువంటి ఆకృత్యాలకు పాల్పడ్డవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యరంగంలో పనిచేసేవారికి ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్సింగ్ స్టాఫ్ జ్యోతి, శాతమ్మతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

హత్యాచార ఘటనకు టీడీపీ ఖండన

మహారాణిపేట: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై వైద్య విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు ప్రకటించారు.

చంపడం అత్యంత పాశవికం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన అత్యంత పాశవికమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఈ హత్యకు నిరసనగా వైద్యులు, జూనియర్ వైద్యులు చేపట్టిన ధర్నాకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల ప్రాణాలు రక్షించే వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందని చెప్పారు. వైద్యులపై దాడులు చేయడం అమానుష చర్య అని అన్నారు. మహిళలకు పనిప్రదేశాల్లో, కళాశాలలో రక్షణ కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య వైద్యార్థిని హత్యాచార ఘటనకు పాల్పడిన మానవ మృగాలను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు.

సిసోడియాను సత్కరించిన రెవెన్యూ ఉద్యోగులు



ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట, ఆగస్టు 17: రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాను జిల్లా రెవెన్యూ శాఖ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. శనివారం కలెక్టరేట్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాదరావు, కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సభ్యులు కలసి ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి సన్మానించారు.

ఇద్దరి చిన్నారులపై అఘాయిత్యానికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు

కంచరపాలెం, ఆగస్టు 17 : జీవిఎంసీ 56 వార్డు పరిధి చాకలిగెడ్డ ముత్యమాంబ కాలనీలో శనివారం ఇద్దరి బాలికలపై ఓ యువకుడు అఘాయిత్యానికి ప్రయత్నించాడు. దీంతో స్థానికులు గుర్తించి అతనిని పోలీసులకు అప్పగించారు.వివరాలివి.. ముత్యమాంబకాలనీలో ఉంటున్న మోహన్ కన్నా (24) కాలనీలో ఆడుకుంటున్న ఇద్దరు బాలికల నోట్లో గుడ్డలు కుక్కి బలవంతానికి యత్నించాడు. దీనిని గమనించిన ఓ మహిళ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని మోహన్ కన్నాను పట్టుకున్నారు. జరిగిన ఘటనపై కంచరపాలెం పోలీసులకు సమాచామందించారు. అయితే, స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ఇంటిలిజెన్స్ సీఐ చిన్నారెడ్డికి సమాచారం అందించారు. చిన్నారెడ్డి సూచన మేరకు కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటాద్రిపై ముగిసిన శ్రీరామాయణ హవనం

పెందుర్తి, ఆగస్టు 17: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో 27 రోజుల పాటు చాతుర్మాస దీక్షల్లో భాగంగా చేపట్టిన శ్రీరామాయణ హవనం కార్యక్రమానికి శనివారం స్వస్తి పలికారు. ఈ సందర్భంగా శ్రీవారి నిత్య కల్యాణానికి శ్రీకారం చుట్టారు. పదమూడు రోజుల పాటు నిత్య కల్యాణాన్ని జరపనున్నారు. ఈ నెల 31న జరగనున్న పూర్ణాహుతి, అన్న సమారాధనలతో చాతుర్మాస దీక్షలు ముగుస్తాయి.

కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ ప్రారంభం

అగనంపూడి, ఆగస్టు 17: ఫార్మాసిటీలోని రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఫార్మా ఉత్పత్తిదారుల సమైక్య సంఘం కార్యదర్శి జెట్టి సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా నిర్వాసిత కాలనీల్లో రాంకీ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. విద్యార్థులంతా కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ ఎండీ పీపీ లాల్‌కృష్ణ, సంస్థ డీజీఎం గిరిధర్, రాఘవరెడ్డి, రవికుమార్, ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్, మహేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

అగనంపూడి, ఆగస్టు 17: ఇక్కడి సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 65 మంది నిరుపేదలకు రూ.200 చొప్పున నగదుతో పాటు పలు పేద కుటుంబాలకు నిత్యావరస సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో తాము ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, మస్తాన్ రెడ్డి, పట్టా రామ అప్పారావు, ఎస్.గోవిందరావు, కె.హనుమంతరావు, ఎస్.రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కును ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 17: స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని కోరుతూ బీఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హిరణ్యయ పాండ్యకు బీఎంఎస్ ప్లాంట్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ముంబైలో ఆయనను కలిసి పలు సమస్యలను వివరించారు. ప్లాంటులో ఉత్పత్తి పడిపోయిందని, దీంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 130, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 38, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 38, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	93
ఫారం ధర	--	113
విత్ స్కిన్	--	196
స్కిన్‌లెస్	--	206

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



గోపాలపట్నంలో వైద్యులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే గణబాబు



ఉక్కు టౌన్‌షిప్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

వైద్యా విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ పలుచోట్ల ఆందోళనలు

గోపాలపట్నంలో వైద్యులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే గణబాబు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ పలుచోట్ల వైద్యులు, వైద్యుల తల్లిదండ్రులు ఆందోళనలు చేశారు. వైద్య విద్యార్థినిపై ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా శనివారం స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం మార్గంలో పలువురు వైద్యుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోతోందని, దీంతో విధి నిర్వహణకు పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ధైర్యంగా విధులు నిర్వర్తించే పరిస్థితులను ప్రభుత్వాలు కల్పించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించే వైద్యులపై ఇటువంటి దాడులు జరగడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ, భాను, మౌనిక, శారద, అరుణ, హేమలత, పద్మ, పలువురు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా ఉక్కు జనరల్ ఆస్పత్రి హెచ్‌వోడీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలిపై దాడి అత్యంత దుర్మార్గమన్నారు. అటువంటి దుశ్చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వాలు చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు గౌతమ్, శాంతిప్రియ, గిరిధర్, సుజాత, కపాడే, మాధవి, రామసత్యం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలో మహిళా సంఘాల కొవ్వొత్తుల ప్రదర్శన



శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆవరణలో..

గోపాలపట్నం బంక్ కూడలిలో..

గోపాలపట్నం: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను ఖండిస్తూ గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య బృందం బంక్ కూడలిలో ఉదయం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు విచ్చేసి వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడానికి కఠినమైన చట్టాలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బంది మానవహారంగా ఏర్పడి నిందితులను కఠినంగా శిక్షించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు.

పెందుర్తిలో కొవ్వొత్తుల ప్రదర్శన

పెందుర్తి: వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ప్రగతిశీల మహిళా సమాఖ్య, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పెందుర్తిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. వైద్యులకు రక్షణ కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. వైద్య సిబ్బంది కోసం కొత్త చట్టాన్ని తీసుకు రావాలన్నారు. పెందుర్తిలోని పలు ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహా మిగతా సేవలను నిలిపివేశారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

వేపగుంటలు/ఎన్ఏడీ జంక్షన్: నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా ఆస్పత్రి ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శంకర్ ఫౌండేషన్ అనుబంధ ఆస్పత్రుల్లోనూ ఓపీ వైద్య సేవలను 24 గంటల వరకు నిలిపివేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్, వైద్యులు రవీంద్ర, కృష్ణ, శిరీష, సుపర్ణ, డీజీఎం కె.బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్ఏడీ భాష్యం స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మణికంఠ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటుకు ముడిసరకు సరఫరా చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు

కూర్మన్నపాలెం, ఆగస్టు 17: స్టీల్‌ప్లాంట్ సక్రమంగా నడిచేందుకు తక్షణమే ముడిసరకును సరఫరా చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,283వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎండీసీ నుంచి ముడిసరకు తెప్పించేందుకు కూటమి నాయకులు కృషి చేయాలని కోరారు. కోల్ అందుబాటులో లేకపోవటంతో బీఎఫ్-1ను మూసివేశారని, షట్‌డౌన్ పేరుతో బీఎఫ్-3ని మూసివేయడం అన్యాయమన్నారు. సాధారణ ఉత్పత్తి దిశగా ప్లాంటును నడిపేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారులపై ఒత్తిడి తేవాలన్నారు. చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ కేంద్రం ప్రకటన చేయాలన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మికులంతా పోరాడి ప్లాంటును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రమణమూర్తి, ప్రసాద్, గోపాలరాజు, సుబ్బారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలుపుతున్న బెహరా భాస్కరరావు, మళ్ల విజయప్రసాద్, తదితరులు

ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు అభినందనలు

గోపాలపట్నం, ఆగస్టు 17: ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు వైసీపీ గోపాలపట్నం మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అభినందనలు తెలిపారు. నగరంలోని బొత్స నివాసంలో శనివారం ఉదయం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మల్కాపురం: ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, పలువురు కార్పొరేటర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 2029లో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు వీవీ సురేశ్, ముర్రు వాణి నానాజీ, గుండపు నాగేశ్వరరావు, నాయకులు జాన్‌వెస్లీ, దొడ్డి కిరణ్, ఆర్.సత్యనారాయణ, జి.వెంకట సత్యనారాయణరాజు (వాసు), తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: బాలుడి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు



మృతుడు యల్లయ్యరెడ్డి (ఫైల్)

పరవాడ, ఆగస్టు 17: ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. కలపాక పంచాయతీ పరిధిలోని స్వయంభూవరం సమీపంలో శుక్రవారం రాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం మరడిదాసరిపేటకు చెందిన ధర్మాల యల్లయ్యరెడ్డి (16), దాసరి అనిల్‌కుమార్‌తోపాటు పిట్టువానిపాలేనికి చెందిన కర్రి జనార్దనరెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి ఆటోలో లైటింగ్ సామగ్రిని పరవాడలో ఓ శుభకార్యం వద్ద దించారు. అనంతరం ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా స్వయంభూవరం దుర్గమాంబ ఆలయ సమీపంలోకి వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న లారీ వీరి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న కర్రి జనార్దన రెడ్డి, పక్కనే కూర్చున్న యల్లయ్యరెడ్డి, వెనక కూర్చున్న దాసరి అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున యల్లయ్యరెడ్డి మృతి చెందాడు. మృతుడు ఐటీఐ చదువుతూ ఖాళీ సమయాల్లో లైటింగ్ పనులకు వెళ్తుంటాడు. గాయపడిన ఇద్దరు యువకులు కోలుకుంటున్నట్లు వైద్యులు వెల్లడించారు. సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ జూనియర్ మోడల్ (ప్రిన్స్) విజేతగా నిలిచిన కార్తికేయరెడ్డి



అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 17: థాయిలాండ్‌లో గత వారం జరిగిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ సీజన్-8 పోటీల్లో షీలానగర్‌కు చెందిన బీజే కార్తికేయరెడ్డి ప్రిన్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. ఈఏ డాది మే 20న కాలికట్‌లో జరిగిన జాతీయ పోటీల్లో ప్రిన్స్ అండర్-8 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. ఇప్పుడు థాయిలాండ్‌లో జరిగిన అంతర్జాతీయ జూనియర్ మోడల్ పోటీల్లోనూ కార్తికేయరెడ్డి విజేతగా నిలిచి అవార్డును సాధించాడు. కార్తికేయరెడ్డి తల్లి పావనీలత భెల్ హెచ్‌పీవీపీలో ఇంజనీర్‌గా, తండ్రి శ్రీనివాసరెడ్డి ఈఐఎల్‌లో ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

పెందుర్తి రూరల్, ఆగస్టు 17: మండలంలోని చింతలఅగ్రహారం రామాలయంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శనివారం రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానికులకు బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సౌమ్య రక్షా బంధన్ ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పి.వెంకటరమణ, ఎ.తాతారావు, పి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా వెంకట సత్యవతి

కూర్మన్నపాలెం, ఆగస్టు 17: జీవీఎంసీ 88వ వార్డు పరిధి నరవ ఎంపీపీ పాఠశాలలో శనివారం స్కూల్ యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు హెచ్ఎం డీఎస్‌బీ కుమారి ఆధ్వర్యంలో జరిగాయి. చైర్‌పర్సన్‌గా కోన వెంకట సత్యవతి, వైస్ చైర్‌పర్సన్‌గా పల్లా లక్ష్మి ఎన్నికయ్యారు. వారికి కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, హెచ్ఎం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వెంకట సత్యవతి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.పైడిరాజు, యు.శ్రీనివాసరావు, చట్టి రాము, పైడిరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ ఇసుక అందేలా చూడాలి : బీఏఐ

విశాఖపట్నం, ఆగస్టు 17: ప్రభుత్వ పనులు ఎక్కువగా చేసే తమకు వీలైనంత త్వరగా ఎక్కువగా ఇసుక అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) విశాఖపట్నం చైర్మన్ సీహెచ్ నవనీత్, గౌరవ కార్యదర్శి ఎం.ఎస్.మూర్తి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టడంతో కాంట్రాక్టర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుత పాలసీ ప్రకారం ఒక వ్యక్తికి ఆధార్ కార్డు ఆధారంగా రోజుకు పది టన్నుల ఇసుక మాత్రమే ఇస్తున్నారన్నారు. బీఏఐ సభ్యులుగా ఉన్న తాము అనేక ప్రభుత్వ పనులు చేస్తున్నామని, తమకు బల్క్ ఇసుక ఇస్తే పనులను త్వరగా పూర్తి చేయగలుగు తామని తెలిపారు.



అక్రమంగా నిర్మించిన షెడ్డులను కూల్చివేస్తున్న దృశ్యం

65వ వార్డులో అక్రమ కట్టడాలు కూల్చివేత

టీడీపీ ధర్నాకు స్పందించిన తహసీల్దార్ రామారావు

పెదగంట్యాడ, ఆగస్టు 17: జీవీఎంసీ 65వ వార్డు పరిధి టిడ్కో గృహాల సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ టీడీపీ నాయకులు శనివారం పెదగంట్యాడ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం టీడీపీ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, నాయకులు ఎస్.సుజాత, ఎస్.ఉమ, పి.వెంకటేశ్వరరావు, తదితరులు తహసీల్దార్ రామారావుకు వినతపత్రం అందజేశారు. అందుకు స్పందించిన అధికారులు తక్షణమే టిడ్కో సమీపంలో అక్రమంగా నిర్మించిన షెడ్డులను తొలగించారు. సర్కారు స్థలాలను ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

బండి సుగుణకు ప్రముఖుల నివాళి



సుగుణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 17: వైజాగ్ ప్రొఫైల్స్, సింహాద్రి టీఎంటీ అధినేత బండి సురేశ్‌కుమార్ మాతృమూర్తి దివంగత బండి సుగుణ చిత్రపటానికి శనివారం గ్రీన్ సిటీ ఫంక్షన్ హాస్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ సురేశ్‌కుమార్ ఎన్నో కర్మాగారాలను నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారని, పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందన్న తల్లి సుగుణ మాటకు కట్టుబడి ముందుకు సాగుతుండడం గొప్ప విషయమన్నారు. బండి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ తన తల్లి సుగుణమ్మ స్ఫూర్తితో భవిష్యత్తులో విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి విజయం వెనక ఓ స్త్రీమూర్తి ఉంటుందని, ఆ ఘనత తొలుత తల్లికే దక్కుతుందన్నారు. అనంతరం భారీఎత్తున అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో బండి సతీశ్‌కుమార్, బండి రమేశ్‌కుమార్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పలువురు రాజకీయ నాయకులు పులుసు జనార్దనరావు, బొండా జగన్, కోన తాతారావు, కరణంరెడ్డి నరసింగరావు, నల్లూరు సూర్యనారాయణ, పప్పు రాజారావు, దేనంకొండ కృష్ణంరాజు, ఐలా, వాసీవా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, కార్మిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు

ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలి

అగనంపూడి, ఆగస్టు 17: విద్యార్థులంతా పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటే లక్ష్యాన్ని సాధించవచ్చని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి మాధురి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మోటివేషన్ (ప్రేరణ) గురించి ఆమె అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ముందున్న సవాళ్లను ఎదుర్కొని ఎలా రాణించాలో వివరించారు. పలువురి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

» 52 మందికి పోస్టింగ్స్

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో శనివారం రాత్రి విశాఖ రేంజ్ పరిధిలో భారీగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి.

ఇప్పటికే పలుచోట్ల పనిచేస్తున్న అధికారులు, పోస్టింగ్స్ కోసం ఎదురుచూస్తున్న మొత్తం 52 మందిని బదిలీ చేస్తూ రేంజ్ డీఐడీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేంజ్‌లో ఇంత ఎక్కువ మందిని బదిలీలు చేయడం ఇదే తొలిసారి.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్	బదిలీ అయిన సర్కిల్
టీవీ విజయకుమార్	సోషల్‌మీడియా సెల్ అనకాపల్లి టౌన్	విజయనగరం
చిల్లా నరసింగరావు	విశాఖ రేంజ్	రాంబిల్లి
ఎస్.లక్ష్మణరావు	రాంబిల్లి	విశాఖ రేంజ్
ఎ.విజయకుమార్	నక్కపల్లి యూపీఎస్	టెక్కలి యూపీఎస్
పి.పైడయ్య	టెక్కలి యూపీఎస్	విశాఖ రేంజ్
కె.కుమారస్వామి	అనకాపల్లి సోషల్ మీడియాసెల్	నక్కపల్లి యూపీఎస్
జి.కోటేశ్వరరావు	విశాఖ రేంజ్	కొత్తకోట
ఎల్.అప్పలనాయుడు	కొత్తకోట సర్కిల్	విశాఖ రేంజ్
ఎస్.ధనుంజయరావు	అనకాపల్లి రూరల్	ఎలమంచిలి
ఎస్కే గఫూర్	ఎలమంచిలి	విశాఖ రేంజ్
కె.సతీశ్‌కుమార్	రుషికొండ మెరైన్	బొబ్బిలి టౌన్
ఎం.నాగేశ్వరరావు	బొబ్బిలి టౌన్	విశాఖ రేంజ్
ఎల్.హిమగిరి	డీఎస్‌బీ, ఏఎస్‌ఆర్ జిల్లా	అరకు
సీహెచ్ రుద్రశేఖర్	అరకు	విశాఖ రేంజ్
బి.అప్పలనాయుడు	విశాఖ రేంజ్	డీఎస్‌బీ,ఏఎస్‌ఆర్‌జిల్లా
జి.అశోక్‌కుమార్	డీటీసీ, ఏఎస్‌ఆర్ జిల్లా	విజయనగరం రూరల్
ముదిలి శ్రీనివాసరావు	విజయనగరం రూరల్	జీకే వీధి
వి.నారాయణరావు	డీసీఆర్‌బీ, ఏఎస్‌ఆర్ జిల్లా	పార్వతీపురం టౌన్
హెచ్ మల్లేశ్వరరావు	విశాఖ రేంజ్ డీసీఆర్‌బీ	ఏఎస్‌ఆర్ జిల్లా
పీవీవీఎస్ఎన్ నరసింహరావు	పార్వతీపురం టౌన్	విశాఖ రేంజ్
పి.అప్పలరాజు	పాయకరావుపేట యూపీఎస్	చోడవరం యూపీఎస్
బమ్మిడి శ్రీనివాసరావు	చోడవరం యూపీఎస్	విశాఖ రేంజ్
జి.ప్రేమ్‌కుమార్	విశాఖ రేంజ్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్
ఎం.చంద్రశేఖర్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్	విశాఖ రేంజ్
ఎ.స్వామినాయుడు	విశాఖ రేంజ్	కశింకోట యూపీఎస్
ఎం.వినోద్‌బాబు	కశింకోట యూపీఎస్	విశాఖ రేంజ్
కె.లక్ష్మణమూర్తి	విశాఖ రేంజ్	అనకాల్లి డీఎస్‌బీ-2
కె.అప్పలనాయుడు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి సీసీఎస్
ఆర్.నీలయ్య	అనకాపల్లి సీసీఎస్	విశాఖ రేంజ్
ఎన్‌వీ ప్రభాకరరావు	విశాఖ రేంజ్	భోగాపురం యూపీఎస్
ఎ.రవికుమార్	భోగాపురం యూపీఎస్	విజయనగరం పీసీఆర్
సీహెచ్ రాజశేఖరరావు	విజయనగరం పీసీఆర్	విశాఖ రేంజ్
కె.అశోక్‌కుమార్	విజయనగరం టాస్క్‌ఫోర్స్ సెల్	రాజాం టౌన్
డి.మోహనరావు	రాజాం టౌన్	కాశీబుగ్గ అర్బన్
ఎన్‌హెచ్‌వీ ఆనంద్	కాశీబుగ్గ అర్బన్	విశాఖ రేంజ్
జి .శంకరరావు	అనకాపల్లి టౌన్	చీపురుపల్లి
ఈ.నరసింహమూర్తి	విజయనగరం డీఎస్‌బీ-2	విజయనగరం మహిళాస్టేషన్
బి.నాగేశ్వరరావు	విజయనగరం మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
ఏవీ లీలారావు	విజయనగరం డీటీసీ	విజయనగరండీఎస్‌బీ-2
బి.లలిత	విజయనగరంలో రిజర్వు	విజయనగరం డీటీసీ
పి.సత్యనారాయణ	ఎల్విన్‌పేట	ఆమదాలవలస
దివాకర వాయునందన యాదవ్	ఆమదాలవలస	వీఆర్
బి.హరి	నర్సీపట్నం	ఎల్విన్‌పేట
ఎం.వెంకటనారాయణ	ట్రాన్స్‌కో నుంచి వచ్చిన అధికారి	అనకాపల్లి ట్రాఫిక్
పి.పైడపునాయుడు	అనకాపల్లి ట్రాఫిక్	వీఆర్
బి.ప్రసాదరావు	విశాఖ రేంజ్	కళింగపట్నం మెరైన్
కె.మురళీధర్	పార్వతీపురంమన్యం వీఆర్	పార్వతీపురంమన్యం డీఎస్‌బీ-2
ఆర్‌వీఎస్ఎస్‌సీహెచ్ శేఖరరావు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి మహిళా స్టేషన్
డి.దీనబంధు	అనకాపల్లి మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
సీహెచ్ వెంకటరావు	శ్రీకాకుళం మహిళా స్టేషన్	జి.మాడుగుల
సి.వాసునాయుడు	సాలూరు టౌన్	ఏఎస్‌ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్‌టాస్క్‌ఫోర్స్
బి.అప్పలనాయుడు	జీకే. వీధి	సాలూరు టౌన్

పిల్లలకు మత్తు ఔషధాలు విక్రయిస్తే కఠిన చర్యలు

» బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ అప్పారావు, అధికారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 17: పిల్లలకు మత్తు ఔషధాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు సిఫారసు చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ హెచ్చరించారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని జీవీఎంసీ జోన్-4 కార్యాలయ సెమినార్ హాల్‌లో శనివారం బాలలహక్కుల పరిరక్షణ కమిషన్, విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిరోధంలో భాగంగా మందుల దుకాణాల యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ అధ్యక్షత జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దలు తోడు లేకుండా, వైద్యులు సిఫార్సు చీటీలు లేకుండా వచ్చే పిల్లలకు కోరెక్స్ వంటి దగ్గు మందులు, అల్ప్రాజోలం, ఎంజీ బెంజోడియా జెపినిస్, దయాజెపం, నైట్రాజెపం, ఆల్ప్రెక్స్ ట్యాబ్లాయిడ్స్ మత్తు ఇంజక్షన్లు విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. ఐసీడీఎస్ పీడీ జయదేవి, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, ఎం.రజని, వి. అభిప్రియా రావు, కూన కల్యాణి, డ్రగ్గిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు, పండ్లు పంపిణీ

సీతంపేట, ఆగస్టు 17: సీతంపేట మధురానగర్‌లోని క్లౌడ్ బ్రిడ్స్ సంస్థ.. శాంతి ఆశ్రమంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పండ్లు పంపిణీ చేసింది. సంస్థ సీఈవో అరుణ్ వెల్లంకి ఆశ్రమంలోని చెవిటి మూగ విద్యార్థులకు సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో సేవ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చిన్నారులకు ఆసరా పలు కార్య క్రవలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

తద్వారా వారు ఇచ్చిన ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో అనధికార లేఅవుట్లు ఎక్కువగా ఉన్నాయని, డెవలపర్లు చదరపు గజాల వంతున విక్రయిస్తున్నారన్నారు. లేఅవుట్‌కు అన్ని అనుమతులు ఉంటేనే క్రయ విక్రయాలకు అనుమతించాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించామన్నారు.

వ్యవసాయ భూములు రెసిడెన్షియల్ ఏరియా అవుతుందని , అయితే కమర్షియల్ కాబోదని పేర్కొంటూ అటువంటిసమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు.

చివరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా సమస్యలతో వచ్చారన్నారు. దసపల్లా భూములకు గతంలో ఎస్టేట్ ఆఫీసర్ గ్రౌండ్ రెంట్ పట్టా ఇచ్చారని, వాస్తవంగా అటువంటి పట్టా ఇవ్వకూడదన్నారు. విశాఖ అర్బన్ ప్రాంతంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, రెవెన్యూ, జీవీఎంసీలు సమన్వయంతో వ్యవహరిస్తే పరిష్కారం దొరుకుతుందన్నారు. హయగ్రీవ భూముల్లో నిర్మాణాలు జరుగుతున్నట్టు తమ పర్యటనలో గుర్తించామని, వాటిపై కోర్టులో కేసు ఉందని చెబుతూ ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. శారదా పీఠానికి భీమిలి మండలం కొత్తవలసలో కారుచౌకగా భూములు ఇచ్చారన్నారు. ఎకరా రూ.1.5 కోట్లకు ఇవ్వాలని కలెక్టర్ ప్రతిపాదించగా కేవలం రూ.లక్షకు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జీవోలో పేర్కొన్న మేరకు అక్కడ పనులు జరగాలని, అందుకు భిన్నంగా కార్యకలాపాలు జరిగితే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

రోడ్డెక్కిన వైద్యులు

... 5వ పేజీ తరువాయి

1,500 మంది జూనియర్ వైద్యులు (యూజీ/పీజీ విద్యార్థులు) ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. నిందితులను తక్షణమే శిక్షించాలంటూ ఈ సందర్భంగా నినాదాలు చేశారు. అనంతరం దీక్షా శిబిరంలో కూర్చుని శాంతియుతంగా నిరసన తెలియజేశారు. జూనియర్ వైద్యుల రిలే దీక్షలకు హోంమంత్రి వంగలపూడి అనిత సంఘీభావాన్ని తెలియజేశారు. జూడాలతో కూర్చుని ప్లకార్డులను ప్రదర్శించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన విభాగాలు, ప్రజా, విద్యార్థి, మహిళా, కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులు సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర మెడికల్ కళాశాల జూడా అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పృథ్వీ, సలహాదారు డాక్టర్ జహంగీర్, ట్రెజరర్ డాక్టర్ ప్రణీత, తదితరులు మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వైద్యులకు రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలను అమలు చేయాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు నగర పరిధిలోని అనేక ప్రైవేటు/కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పనిచేసే సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేజీహెచ్, ఘోషా, ఈఎన్‌టీ, విమ్స్ తదితర ఆస్పత్రుల సిబ్బంది కొన్ని నిమిషాలు బయటకు వచ్చి నినాదాలు చేశారు. గాజువాకలో ప్రైవేటు హాస్పిటల్స్ సిబ్బంది ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు.

కేజీహెచ్‌లో కొనసాగిన వైద్య సేవలు

ఆంధ్ర మెడికల్ కళాశాలలోని బోధనాస్పత్రుల్లో మాత్రం రోగులకు ఇబ్బందులు లేకుండా యథావిధిగా ఓపీ సేవలను కొనసాగించారు. కేజీహెచ్‌లో సుమారు 1,400 మందికి ఓపీ సేవలు అందించారు. ఆరు సర్జరీలు నిర్వహించగా, క్యాజువాల్టీలో అత్యవసర పరిస్థితుల్లో చేరిన ముగ్గురికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అయితే, ఆటోల్లో, అంబులెన్స్‌లలో వచ్చిన రోగులను వార్డులు, ఓపీలకు తీసుకువెళ్లాల్సిన వార్డుబాయ్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రోగులను వారి కుటుంబ సభ్యులే దగ్గరుండి తీసుకువెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలావుంటే విమ్స్‌లో 150 మందికి ఓపీ సేవలు అందించారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నామన్నారు. గంజాయి సాగవుతున్న ప్రాంతాలు ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్టు శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించామన్నారు. గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలకు ఎస్పీలు, ఇతర అధికారులు వెళ్లి ప్రత్యామ్నాయ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఐజీ ఆదేశించారు. దీని కోసం ప్రభుత్వ శాఖల అంతర్గత కమిటీ ఏర్పాటుచేసి తరచూ గ్రామాల్లో అవగాహన సమావేశాలు, కళాజాతలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నిషేధం, వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలపై గిరిజనులకు అర్థమయ్యేలా ముఖ్యమైన జంక్షన్లు, ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్, విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏడీపీఎస్ స్పెషల్ ప్రాసిక్యూటర్ వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వైసీపీలో బొత్స పాగా

... 5వ పేజీ తరువాయి

బొత్స తరచూ విశాఖలోనే విలేకరుల సమావేశాలు నిర్వహించి పార్టీ గళం వినిపించడంతోపాటు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి స్థానికంగా పలువురు నేతలు పోటీ పడ్డారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడుతోపాటు మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పోటీకి ఆసక్తి చూపినట్టు ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా వారెవరినీ కాకుండా పొరుగు జిల్లాకు చెందిన బొత్సను అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానిక సంస్థల్లో వైసీపీకి మెజారిటీ ఉండడంతో కూటమి పోటీకి దూరంగా ఉంటున్నట్టు ప్రకటించింది. దీంతో ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కీలకమైన విశాఖలో పార్టీకి పెద్దదిక్కు లేదనే అభిప్రాయంతో ఉన్న అధిష్ఠానం...ఇకపై బొత్స ఆ లోటు తీరుస్తారనే ఆశలు పెట్టుకుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో పార్టీకి బొత్స కేంద్రబిందువు కానున్నారనడంలో అనుమానం లేదని సీనియర్ నేతలు సైతం అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటు ఆర్థిక పురోగతికి దోహదం

... 5వ పేజీ తరువాయి

ఒక మైలురాయి అని పేర్కొన్నారు. లీజు పొడిగింపునకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ విశేష కృషిచేశారని పేర్కొన్నారు. మైన్స్ లీజు ప్రాంతం 654 ఎకరాలని, వార్షిక వినియోగం ఏడాదికి ఆరు వేల టన్నులని పేర్కొన్నారు. హాట్‌మెటల్ ఉత్పత్తి చేయడానికి బ్లాస్టఫర్నేస్‌లలో మాంగనీసు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ లీజు పొడిగింపు సంస్థ ఆర్థిక పురోగతికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

దేశంలో తీవ్రస్థాయిలో నిరుద్యోగ సమస్య



మాట్లాడుతున్న సతీష్

డాబాగార్డెన్స్, ఆగస్టు 17: దేశంలో నిరుద్యోగ సమస్య అత్యంత తీవ్ర స్థాయిలో ఉందని సౌత్ సెంట్రల్ జోనల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం యూనియన్ విశాఖ డివిజన్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమాల్లో భాగంగా 'భారతదేశం-నిరుద్యోగ సమస్యకు కారణాలు... పరిష్కారం' అనే అంశంపై విశాఖ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 46ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 9.2 శాతం నిరుద్యోగ్య సమస్య నమోదైనట్టు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 56 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయడంలేదన్నారు. విశ్రాంత లెక్చరర్ కె. పద్మ , ఎస్ఎఫ్ఐ నాయకులు నాయుడు, డీవైఎఫ్ నాయకులు సంతోష్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, కార్యదర్శి జి.వరప్రసాద్, మీడియా ఇన్‌చార్జ్ ఏ.రామకృష్ణ పాల్గొన్నారు.

'ఆక్రమిత ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలి'



ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వినతి పత్రమిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం, ఆగస్టు 17: విశాఖ జిల్లాలో ఆక్రమణదారుల చెరలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిఆర్.పి. సిసోడియాను సీపీఐ నాయకులు కోరారు. సోమవారం కార్యదర్శికి ఈ మేరకు వినతి పత్రమిచ్చారు. విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెంలో వైసీపీ నాయకుడు ధర్మాన ప్రసాదరావు. కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు కబ్జాచేసిన సర్వే నెం187/1లో 4.89 ఎకరాలు భూమి ,కొమ్మాదిలో కె.శ్రీనివాసరెడ్డి సర్వే నం: 28/2లో 10.18 ఎకరాలు, సర్వే నం: 154/3లో 5 ఎకరాలు, సర్వే నం: 7 పార్టులో 10 ఎకరాలు, 161/1లో 10 ఎకరాలు, పరదేశిపాలెం పంచాయతీలో 166/1లో 23 ఎకరాలు, 132లో 50 ఎకరాలు, నరవ గ్రామం సర్వే నం: 7లో 42.25 ఎకరాలు, మధురవాడ సర్వే 331/5 లో 10 ఎకరాలు, 367లో 10 ఎకరాలు, పెదగంట్యాడలో 274లో తిప్పలనాగిరెడ్డి కుటుంబసభ్యులు సొంతం చేసుకున్న 60 ఎకరాలు, దసపల్లా భూములు, 22ఏ లో అన్యాక్రాంతం చేసి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

చీటీలు, ముందస్తు డిపాజిట్ల సేకరణపై కేసులు నమోదు: సీపీ

మహరాణిపేట, ఆగస్టు 17: అనధికారికంగా డిపాజిట్లను సేకరిస్తున్న వారిపై రెండు కేసులు నమోదు చేసి సంబంధిత వ్యక్తులను అరెస్టు చేసినట్టు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చీ తెలిపారు. శనివారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రకాల ఆర్థిక నేరాలు, చీటీల వ్యాపారం, గొలుసు కట్టు వ్యాపారం, మల్టీలెవల్ మార్కెటింగ్ ద్వారా వ్యక్తుల నుం చి ముం దస్తు డిపాజిట్లు సేకరించి టెర్మ్ పూర్తయిన తరువాత తిరిగి సమ్ము చెల్లించని వ్యక్తులపై, కొన్ని రకాల రియల్ ఎస్టేట్ వ్యాపారంతో మోసం చేస్తున్న వారు, ట్రస్టులపేరుతో మోసాలు చేసేవారు ఏపీ ప్రొ టెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నేరస్తులని పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మహరాణిపేట, ఆగస్టు 17: కోల్‌కత్తా ఘటన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వైద్య సేవలునిలిచినా, కేజీహెచ్‌లో రోగులకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటుద్వారా సేవలందిస్తున్నట్టు సూపరింటెండెంట్ శివానంద తెలిపారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశ వ్యాప్తంగా 24 గంటలపాటు అత్యవసర వైద్యం మినహా మిగిలిన సేవలు నిలిపివేయాలని పిలుపు నిచ్చింది. ఈ బంద్‌లో జూనియర్ డాక్టర్లతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ సీనియర్ వైద్యులు బంద్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో శనివారం బంద్ విషయం తెలియని అనేక మంది రోగులు కేజీహెచ్‌కు తరలివచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. శనివారం కేజీహెచ్‌లో 1451 మంది కొత్తగా ఓపీ రోగులకు, 384 మంది పాత రోగులు, 85 మంది ఐపీ రోగులకు, 52 క్యాజువాలిటీలో ఎమర్జన్సీ రోగులు చికిత్స పొందారని వివరించారు. అలాగే, మూడు సర్జరీలు, రెండు అత్యవసర శ స్త్ర చికిత్సలు నిర్వహించినట్టు చెప్పారు. పారా క్లినికల్ ప్యాకల్టీ సీనియర్ రెసిడెంట్లు, సర్వీస్ పోస్టుగ్రాడ్యూట్ వైద్యులను నియమించి రోగులకు చికిత్స అందించి ఎటువంటి ఆటంకం కలుగకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు.

సోమవారం నుంచి కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

మహరాణిపేట, ఆగస్టు 17: కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 19 వ తేదీ సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అ న్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరి స్తారన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సినీ కళామతల్లి ముద్దుబిడ్డ మెగాస్టార్ చిరంజీవి



ప్రసంగిస్తున్న సినీనిర్మాత కంచర్ల అచ్యుతరావు

డాబాగార్డెన్స్, ఆగస్టు 17: సినీ కళామతల్లి ముద్దుబిడ్డ మెగాస్టార్ చిరంజీవి అని సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డా.చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. చిరంజీవి సేవాతత్పరులు అన్నారు. చిరంజీవి జీవిత కథ చిత్రం తీస్తానని తెలిపారు. సినీ రంగంలోని రాణించాలనుకునేవారంతా తప్పకుండా చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు జి.జగదీష్, కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎస్సీల వర్గీకరణతో రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

» మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు



సంఘీభావం తెలుపుతున్న మాలమహానాడు ప్రతినిధులు

సీతంపేట, ఆగస్టు 17: ఎస్సీల వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చే విధంగా ఉందని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత మేధావులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అన్యాయంగా ఉందన్నారు. కుల సంఘాల సభకు ప్రధాని హాజరయ్యారన్నారు. మంద కృ ష్ణ మాదిగ ఢిల్లీలో కొందరిని కలిసి ఈ విధంగా తీర్పు వచ్చేలా ప్రయత్నాలు చేసినట్టు ఆయన ఆరోపించారు. ఉషా కమిషన్ నివేదిక ప్రకారం మాదిగలకు ఎక్కడా అన్యాయం జరగలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఉప కులాలమధ్య చిచ్చు పెట్టేలా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ఫౌండర్ కన్వీనర్ డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ మాలలపై విషం కక్కుతున్న వారిని తరిమికొడుతామన్నారు. సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ తీర్పు ద్వారా వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు, దళిత ప్రజా వేదిక ప్రతినిధి ఆలీ, హేమసుందర్, డాక్టర్ బూసి వెంకటరావు, ఎం.అప్పలరాజు, పి.సుధాకర్, బొంత శ్యామ్ రవిప్రకాశ్, సాంబయ్య, తిరుపతిరావు, ప్రొఫెసర్ ఆశోక్ అంబేడ్కర్, చక్రవర్తి, బొచ్చ రామసూర్య, ఎంవి రాహుల్, తదితరలు పాల్గొన్నారు.

సిసోడియాను సత్కరించిన రెవెన్యూ ఉద్యోగులు



ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న ఉద్యోగులు

మహరాణిపేట, ఆగస్టు 17: రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియాను జిల్లా రెవెన్యూ శాఖ అసోసియేషన్ ప్రతినిధులు ఘ నంగా సత్కరించారు. శనివారం కలెక్టరేట్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాధరావు, కార్య దర్శి రమేష్ ఆధ్వర్యంలో సభ్యులు కలసి ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి సన్మానించారు.

ఇకపై ఆన్‌లైన్‌లోనే ఎఫ్ఐఆర్ కాపీ: సీపీ

మహరాణిపేట, ఆగస్టు 17: పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసిన బాధితులు ఎఫ్ఐఆర్‌ను ఇకపై ఆన్‌లైన్‌లో సులువుగా పొందవచ్చని నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రాత బాగ్చీ తెలిపారు. శనివారం పోలీసు కమిషనరేటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులు తమ ఫిర్యాదు ఇచ్చిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదవుతుందని, అ నంతరం సంబంధిత ఎఫ్ఐఆర్ కాపీని గతంలోలా స్టేషన్‌కులోకాకుండా ఏపీ పోలీసు వారి వెబ్‌సైట్ నుంచి ఇచ్చిన లింక్‌ను వినియోగించి డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

వైద్యుల నిరసన



ఘోషాసుపత్రి ఆవరణలో నర్సింగ్ ఉద్యోగుల నిరసన

పూర్ణామార్కెట్, ఆగస్టు 17: కోల్‌కత్తాలోని అజీర్‌కార్ ఆసుపత్రిలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రి నర్సింగ్ స్టాఫ్, వైద్యవర్గాలు శనివారం నిరసన తెలిపాయి. శనివారం ఆసుపత్రి ఆవరణలో మహిళలకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఇటువంటి ఆకృత్యాలకు పాల్పడ్డవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యరంగంలో పనిచేసేవారికి ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్సింగ్ స్టాఫ్ జ్యోతి, శాతమ్మతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

హత్యాచార ఘటనకు టీడీపీ ఖండన

మహరాణిపేట: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై వైద్య విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు ప్రకటించారు.

చంపడం అత్యంత పాశవికం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన అత్యంత పాశవికమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఈ హత్యకు నిరసనగా వైద్యులు, జూనియర్ వైద్యులు చేపట్టిన ధర్నాకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల ప్రాణాలు రక్షించే వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందని చెప్పారు. వైద్యులపై దాడులు చేయడం అమానుష చర్య అని అన్నారు. మహిళలకు పనిప్రదేశాల్లో, కళాశాలలో రక్షణ కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య వైద్యార్థిని హత్యాచార ఘటనకు పాల్పడిన మానవ మృగాలను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు.

ఇద్దరి చిన్నారులపై అఘాయిత్యానికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు

కంచరపాలెం, ఆగస్టు 17 : జీవీఎంసీ 56 వార్డు పరిధి చాకలిగెడ్డ ముత్యమాంబ కాలనీలో శనివారం ఇద్దరి బాలికలపై ఓ యువకుడు అఘాయిత్యానికి ప్రయత్నించాడు. దీంతో స్థానికులు గుర్తించి అతనిని పోలీసులకు అప్పగించారు.వివరాలివి.. ముత్యమాంబకాలనీలో ఉంటున్న మోహన్ కన్నా (24) కాలనీలో ఆడుకుంటున్న ఇద్దరు బాలికల నోట్లో గుడ్డలు కుక్కి బలవంతానికి యత్నించాడు. దీనిని గమనించిన ఓ మహిళ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని మోహన్ కన్నాను పట్టుకున్నారు. జరిగిన ఘటనపై కంచరపాలెం పోలీసులకు సమాచామందించారు. అయితే, స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ఇంటెలిజెన్స్ సీఐ చిన్నారెడ్డికి సమాచారం అందించారు. చిన్నారెడ్డి సూచన మేరకు కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

20న కనకమ్మ అమ్మవారి పండుగ

వెంకోజీపాలెం, ఆగస్టు 17 : పాతవెంకోజీపాలెంలో ఈనెల 20న కనకమ్మ అమ్మవారి పండుగ జరగనుంది. ఈమేరకు రాధాకృష్ణ యాదవ సేవా సంఘం, సీతారామ సేవా సంఘం, శెట్టిబలిజ సేవా సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. గొల్లవీధిలో ఉన్న అమ్మవారి ఆలయాన్ని రంగు రంగులతో ఇప్పటికే ముస్తాబు చేశారు. వీధుల్లో విద్యుత్ లైటింగ్ అమరుస్తున్నారు. 19న తొల్లేళ్ళు, 20న ప్రధాన పండుగ, 27న మారు వారం ఉత్సవం, మహా అన్నదానం చేపట్టనున్నారు.

గురుకుల పాఠశాల స్కూల్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

సింహాచలం, ఆగస్టు 17 : మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల (సింహాచలం) పాఠశాల స్కూల్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. పాఠశాల ప్రధానాచార్యులు దాసరి సత్యారావు పర్యవేక్షణలో శనివారం ఈ ఎన్నికలు జరగ్గా కమిటీ చైర్మన్‌గా కె శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా ఐ. చిన్నారితో పాటు 18 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారితో ప్రిన్సిపాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావును కార్పొరేటర్ నరసింహం శాలువతో సత్కరించారు.

అనంతవరంలో..

పద్మనాభం (రూరల్) : మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్‌గా లోకవరపు శంకరరావు ఎన్నికైనట్టు హెచ్‌ఎం కృష్ణ కుమార్ తెలిపారు.ఈనెల 8న జరగాల్సిన ఎన్నిక కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈమేరకు శనివారం పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో శంకరరావు ఛైర్మన్ ఎన్నికయ్యారు. కొవ్వాడ పాఠశాల కమిటీ ఎన్నిక శనివారం కూడా వాయిదా పడింది.

ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ప్రతాప్ సేవలు భేష్

మద్దిలపాలెం, ఆగస్టు 17 : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ప్రతాప్ ఉత్తమ సేవలందిస్తున్నారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు అన్నారు. జాతీయ సేవా పథకం ఉత్తమ అవార్డు అందుకున్న ప్రతాప్‌ను శనివారం కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను శక్తివంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్న ప్రతాప్‌కు ఉత్తమ అధికారి అవార్డు లభించడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం, స్వచ్ఛభారత్, మహిళా సాధికారిత తదితర అంశాల్లో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఉమామహేశ్వరరావు, శ్యామూల్ డేవిడ్ పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు

భీమునిపట్నం, ఆగస్టు 17 : పట్టణంలోని మూడో వార్డు జల గెడ్డ శ్మశానవాటిక స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు కోరారు. శనివారం వారు జడ్పీ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించి, పనులు చేపడుతున్నారని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఎక్కువ ఇసుక అందేలా చూడాలి : బీఏఐ

సిరిపురం, ఆగస్టు 17 : ప్రభుత్వ పనులు ఎక్కువగా చేసే తమకు వీలైనంత త్వరగా ఎక్కువగా ఇసుక అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) విశాఖపట్నం చైర్మన్ సీహెచ్ నవనీత్, గౌరవ కార్యదర్శి ఎం.ఎస్.మూర్తి కోరారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టడంతో కాంట్రాక్టర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమకు బల్క్ ఇసుక ఇస్తే పనులను త్వరగా పూర్తి చేయగలుగుతామని తెలిపారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య, విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు:** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక).
- **తుఫాన్ :** జగదాంబ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా),నరసింహ (గోపాలపట్నం),శ్రీకన్య-1 (గాజువాక), ,అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 130, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 38, దోసకాయ 22, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 93
ఫారం ధర	-- 113
విత్ స్కిన్	-- 196
స్కిన్‌లెస్	-- 206

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



కొత్తవలస కొండపై శారదా పీఠానికి కేటాయించిన భూములను పరిశీలిస్తున్న సిసోడియా



ఎండాడలో హయగ్రీవ ప్రాజెక్ట్‌లో జరుగుతున్న నిర్మాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న సిసోడియా

భీమిలిలో సిసోడియా విస్తృత పర్యటన

- పలు ప్రాంతాల్లోని భూములు పరిశీలన
- ఆర్‌డీఓ కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

భీమునిపట్నం, ఆగస్టు 17 : గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా భీమిలిలో శనివారం విస్తృతంగా పర్యటించారు.తొలుత బీచ్‌రోడ్‌లో వున్న జియో హెరిటేజ్ సైట్ ఎర్రమట్టిదిబ్బలను సందర్శించారు. నేరేళ్లవలసలో సర్వే నంబరు 49/1లో బిల్డింగ్ సొసైటీకి కేటాయించిన 373.95 ఎకరాల్లో 91.50 ఎకరాలు బిల్డింగ్ సొసైటీ స్థలంలో వుందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీవో హుస్సేన్ ఆయనకు వివరించారు. అనంతరం కొత్తవలస కొండ పైభాగంలో పెందుర్తి శారదా పీఠానికి కేటాయించిన 15 ఎకరాలను పరిశీలించారు. అలాగే భీమిలి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమై గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పూలింగ్ వివరాలు, ఫ్రీహోల్డ్ చేసిన 52 ఎకరాల వివరాలు అడిగి తెలుసుకున్నారన్నారు. ఈ సందర్భంగా భీమిలి పట్టణం, మండలానికి చెందిన సరిహద్దు భూముల సర్వే నంబర్ల రికార్డులను పరిశీలించారు. అనంతరం వివిధ సమస్యలపై అన్యాయానికి గురైన భూ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చిప్పాడ, దాకమర్రి, విజయనగరం జిల్లా భోగాపురం మండలం తూడె గ్రామానికి చెందిన దువ్వు ఎర్రయ్య, దువ్వు అప్పన్న, రామకృష్ణ, పైల సూరమ్మ, కొండమ్మ, డెక్కతి నారాయణమ్మ, సొంబాబు, జీరు చిట్టితల్లి, కొయ్య నర్సమ్మ, జీరు దుర్గమ్మ, తదితరులు ఫిర్యాదులు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ సుజన, భీమిలి సబ్ రిజిస్ట్రార్ గోపిచంద్, జీవీఎంసీ జోన్ సర్వేయర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమిలి చక్కటి బీచ్

ఎంతో అందమైన బీచ్.. చక్కటి పచ్చదనం ఉన్న పట్టణం ఎందుకు ఇంత కళావిహీనంగా ఉందని సిసోడియా అధికారులను ప్రశ్నించారు. కొత్తవలసలో సర్వే నంబరు 102, 103లో పెందుర్తి శారదా పీఠానికి కేటాయించిన 15ఎకరాలను ఆయన కొండపై నుంచి పరిశీలించారు. కొండపై నుంచి ఆహ్లాదకరంగా కనిపించిన పచ్చదనం, సాగర తీరాన్ని చూస్తూ.. భీమిలి గోవా బీచ్‌లా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందని జేసీకి చెప్పారు.

ఎండాడ హయగ్రీవ ప్రాజెక్ట్ పరిశీలన

ఎండాడ : ఎండాడలో నిర్మాణంలో ఉన్న హయగ్రీవ ప్రాజెక్టను సిసోడియా పరిశీలించారు.హయగ్రీవ నిర్మాణాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకున్నారా లేదా అని చీఫ్ సిటీ ప్లానింగ్ అధికారిని ప్రశ్నించారు. ఇంత పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నప్పుడు రహదారుల నిర్మాణం ఎందుకు చేపట్టలేదని, మట్టి రోడ్లు ఎందుకున్నాయని ప్రశ్నించారు.వృద్ధ ఆశ్రమ నిర్మాణం ఎక్కడ ఉందని అడిగారు. అదే ఆవరణలో ఐదు అంతస్తుల నిర్మాణంలో ఉన్న భవనాన్ని చూపించి వృద్ధ ఆశ్రమానికి సంబంధించిన భవనమని అధికారులు తెలిపారు.ఆయనతో పాటు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, ఆర్‌డీఓ హుస్సేన్ ఉన్నారు.

రామానాయుడు స్టూడియో..

సాగర్‌నగర్: రామానాయుడు స్టూడియో కొండపై ఉన్న భూములను కూడా సిసోడియా పరిశీలించారు. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కేటాయించిన ఇక్కడి భూములను గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ లేఅవుట్ అభివృద్ధికి కేటాయించి, అమ్మకాలు సాగించే ప్రయత్నాలు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను సిసోడియా అధికారులను అడిగారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 17 : పంటల సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ బి. విజయప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన తాటితూరు గ్రామంలో రైతులకు పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ పంటకు ఏ సమయంలో మందులు వేయాలన్న విషయాన్ని రైతులు తెలుసుకోవాలన్నారు. అనంతరం పురుగులు, తెగుళ్ల, మిత్ర పురుగులు, శత్రు పురుగులపై ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) ప్రతినిధి వర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కోమలి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది స్వాతి, హరీష్, రమేష్, స్రవంతి, కృపామణి, తదితరులు పాల్గొన్నారు.

బహుళ నైపుణ్యాలతో బంగారు భవిష్యత్తు

మద్దిలపాలెం, ఆగస్టు 17 : బహుళ నైపుణ్యాలతో యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఏయూ రిజిస్ట్రార్ కిశోర్‌బాబు అన్నారు. వైవీఎస్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ బీబీఏ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కారకాలుగా నిలుస్తారని చెప్పారు. వారి నిస్వార్థ సేవలు, కృషిని గుర్తించుకుని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఫైనాన్సియల్, మార్కెటింగ్, హెచ్‌ఆర్ స్కిల్స్ కలిగి వుండాలని చెప్పారు. సిబ్ గౌరవ సంచాలకుడు పి. విశ్వనాథం మాట్లాడుతూ అభ్యసనం నిరంతర ప్రక్రియగా కొనసాగినప్పుడే మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి ఉద్యోగ్ లిమిటెడ్, ఇండియా జోనా ఆన్లైన్ కామర్స్ సంస్థల నిర్వాహకులు, సిబ్ ఆచార్యులు, పాల్గొన్నారు.

మాడవీధుల్లో అప్పన్న తిరువీధి



మాడవీధుల్లో తిరువీధి

సింహాచలం, ఆగస్టు 17 : సింహ సంక్రమణ పుణ్యదినాన్ని పురస్కరించుకుని సింహగిరి మాడవీధుల్లో వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే సంక్రమణం రోజున తిరువీధి నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఊరేగిం చారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, ఆలయ ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి పిళ్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్విచ్ బోర్డుకు రక్షణ చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పద్మనాభం (రూరల్), ఆగస్టు 17 : కృష్ణాపురంలో వాటర్ ట్యాంకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్విచ్ బోర్డుకు అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ప్రమాదకరంగా స్విచ్ బోర్డు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వచ్చిన కథనానికి ఆ శాఖాధికారులు స్పందించారు. ఈమేరకు స్విచ్ బోర్డు ఏర్పాటుతో పాటు ఎర్తవైరు సరిచేశారు.



మధురవాడలో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కోల్‌కతా ఘటనపై నిరసనలు

మద్దిలపాలెం, ఆగస్టు 17 : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి, హత్య చేయడాన్ని నిరసిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం కృష్ణా కళాశాల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మీ మాట్లాడుతూ వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి, హత్య చేయడం హేయమైన చర్యన్నారు. ఈ నేరంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హస్తం ఉన్నట్టు బలమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాలు నిర్భయ, దిశ వంటి చట్టాలు తీసుకురావడం తప్పమహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యార్థిని మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) ఆధ్వర్యంలో కూడా కృష్ణ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ నగర కమిటీ అధ్యక్షుడు కె. అభిలాష్, బి. శివ, గౌతమి చరణ్, చిన్నారావు పాల్గొన్నారు.

తగరపువలస : వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణ ఘటనను ఖండిస్తూ తగరపువలస పరిసర ప్రాంతాలకు చెందిన వైద్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. సంగివలస ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల వైద్యులు, విద్యార్థులు సంగివలస నుంచి తగరపువలస వరకు ర్యాలీ చేసి, అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డాడు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ కళాశాలకు చెందిన పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

ఆనందపురం : నీళ్లకుండీలు జంక్షన్‌లో ఉన్న సాయి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు వైద్య విద్యార్థిపై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాకల శ్రీవల్లీ ప్రియ, ఉపాధ్యాయులు అరుణ, మంజుల, సంతోషి, దమయంతి పాల్గొన్నారు.

భీమునిపట్నం : భీమిలిలో వైద్యాధికారులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. స్థానిక యూపీహెచ్‌సీ వైద్యాధికారి జి. కళ్యాణ్ చక్రవర్తి, రిటైర్డ్ గైనికాలజిస్టు సీహెచ్ కనకదుర్గ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆస్పత్రి నుంచి పట్టణ పురవీధుల్లో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నబజారు జంక్షన్‌లో మానవహారం చేపట్టారు.

ఆరిలోవ : హెల్త్ సిటీలో వైద్య సేవలు నిలిపి వేశారు. అత్యవసర సేవలు, శస్త్ర చికిత్సలు తప్ప మిగిలిన సేవలను నిలిపివేశారు. వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనను ఖండిస్తూ ఆయా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది ర్యాలీ చేశారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విమ్స్‌లో కూడా వైద్య సేవలు నిలిపివేశారు. అత్యవసర కేసులకు సంబంధించి 80 మందికి చికిత్స అందించారు.

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని పలు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య శాలలో ఓపీ నిలిపివేశారు.

ఎండాడ : కోల్‌కతా ఘటన అత్యంత హేయమైనదని, బాధ్యులను ఇప్పటివరకు గుర్తించకపోవడం అన్యాయమని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్యులు అన్నారు. జిమ్‌సర్‌కి చెందిన పీజీ వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్య విద్యార్థులు గీతం ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. గీతం ప్రాంగణం నుంచి ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డు వరకు ర్యాలీ సాగింది.

కొమ్మాది : జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కళాశాల వైద్యులు, సిబ్బంది ప్రధాన ద్వారం వద్ద మానవహారం చేపట్టారు. వైద్య విద్యార్థినికి మద్దతుగా నినాదాలు చేశారు.

రామ్‌నగర్ : బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ ఐ. వాణి, డాక్టర్ అప్పారావు, బీజేపీ నాయకులు రాధాకుమారి, జిల్లా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాతరాజ్, రోహిణి, ధనేశ్వర రావు, ప్రేమ్‌కుమారి, నీలి సుబ్బలక్ష్మి, ఆంధ్రా వైద్య కళాశాల, కేజీహెచ్‌కు చెందిన వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి : డీఈఓ

సింహాచలం, ఆగస్టు 17 : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఈఓ ఎల్. చంద్రకళ సూచించారు. అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివ రించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం శాంతిభద్రతల విభాగం ఎస్ఐ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఈఓ చంద్రకళ, ఉపాధ్యాయులు

తీర్థ బిందె సంప్రదాయం పునఃప్రారంభం

సింహాచలం, ఆగస్టు 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో తీర్థ బిందె సంప్రదాయాన్ని శనివారం నుంచి పునఃప్రారంభించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన తరువాత సింహగిరి ఈశాన్య దిక్కున ఉన్న గంగధార నుంచి జలాలను తీర్థ బిందెతో తీసుకువచ్చారు. వాటిని ఆలయంలోని స్వామివారి తీర్థం, ఇతర వైదిక అవసరాలకు వినియోగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు. కాగా తెల్లవారుజామున తీర్థ బిందె కార్యక్రమంలో పాల్గొనేందుకు రానున్నట్టు ఈఓ శుక్రవారం రాత్రే సమాచారం ఇచ్చినప్పటికీ ఆ సమయంలో పర్యవేక్షణాధికారి, డోలు కళాకారుడు లేకపోవడం, అర్చకులు త్రిపురాంతకస్వామి దేవాలయాన్ని సకాలంలో తెరవపోవడం వంటి లోపాలను ఈఓ గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు.

చిరంజీవి జన్మదిన వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 17 : సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకల పోస్టర్‌ను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా మెగా ఫ్యామిలీ యువత ఈనెల 21న సాగరతీరంలో జరిగే వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను ముద్రించారు. అలాగే భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా గాయకుడు వి. రామకృష్ణ 77 జయంతి సందర్భంగా సినీ సంగీత విభావరి పోస్టర్‌ను విడుదల చేశారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



సింహాచలం, ఆగస్టు 17 : వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. సాధారణ భక్తులతో పాటు నూతన జంటలు, వారి బంధుమిత్రులు అధికంగా రావడంతో సింహగిరి కిటకిటలాడింది. సూర్యోదయం నుండే కొండపై రద్దీ నెలకొంది. శనివారం ఒక్కరోజే స్వామివారి ఖజానాకు సుమారు రూ. 29.7 లక్షల ఆదాయం సమకూరింది. అత్యధికంగా రూ.100, రూ.300 దర్శన టికెట్ల విక్రయాల ద్వారా రూ.17.3 లక్షలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.8.33 లక్షలు, తలనీలాల టికెట్ల ద్వారా రూ.2.32 లక్షలు ఆదాయం లభించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ముగ్గురిని కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, ఆగస్టు 17 : రుషికొండ బీచ్‌లో శనివారం సముద్ర స్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ముగ్గురు విద్యార్థులను లైఫ్‌గార్డులు రక్షించారు. హైదరాబాద్ నుంచి 40 మంది విద్యార్థుల బృందం విహార యాత్రకు వచ్చారు. వారంతా బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగగా బి.దీపక్ (15), ఎస్.నితిన్ (15), ఎస్.కౌశిక్ (18) కెరటం తాకిడికి సముద్రం లోకి కొట్టుకుపోతుండగా మిగతా వారు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న లైఫ్‌గార్డులు గమనించి వారిని సురక్షితంగా ఒడ్డుకి చేర్చారు.

విద్యార్థులకు సత్కారం

సింహాచలం, ఆగస్టు 17 : ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా సింహాచలం గురుకుల పాఠశాల నుంచి వెళ్లిన విద్యార్థులను పాఠశాల ప్రధానాచార్యులు దాసరి సత్యారావు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఆహ్వానం అందిందని తెలిపారు.